సొదుం జయరాం కథలు

3

# గూటిలో చిలక

పొద్దున్నే లేచి పళ్లు తోముకుంటున్నారు. మా ఇంటికి నాలుగిళ్లవతల నుంచి యేడుపులూ, పెడబొబ్బలూ వినిపించాయి. యేమిటో చూద్దామని వాకిట్లోకి వచ్చాను. నారాయణ ఇంటిముందు జనం గుమిగూడి వున్నారు. ఏం జరిగిందో నాకు బోధపడలేదు. ఇంతలోనే అమ్మ వచ్చింది అక్కణ్ణుంచి.

"ఏమిటమ్మా?" అన్నాను ఆత్రంగా.

"ఏముంది? నారాయణ భార్య పోయింది" అన్నది అమ్మ.

"ఏమయిందేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"నీదంతా మరీ చోద్యం. ఆ పిల్లకి భూమ్మీద నూకలు చెల్లాయి, పోయింది. నిందలేందే బొందెపోదని ఏవో కారణాలుంటాయి. మొన్న బాగానే వుంది. నిన్న జ్వరం, ఇవ్వాళ పోయింది. ప్రాణం పోకడా, వాన రాకడా ఎవరికి తెలుస్తుంది? ప్చ్!" అమ్మ పెళపెళా వేదాంతం వల్లించింది.

గూటిలో చిలక ఎందుకు ఎగిరిపోయిందో అడక్కూడదు. అడిగినవాడు అజ్ఞానికింద జమ! నిజమే మరి. బుర్రలోకి కొంచెం వేదాంతం దట్టిస్తే ఎక్కడికక్కడ సరిపెట్టుకోవచ్చు. ప్రతి సంఘటనకి, కారణాలు వెతకడమనేది- అశాంతిని కొని తెచ్చుకోవడం తప్ప మరేం కాదు. అశాంతి కొని తెచ్చుకొనేవాణ్ణి అజ్ఞానేం ఖర్మ, అడ్డగాడిద అన్నా చెల్లుతుంది.

నారాయణ భార్య పోయిందని విన్నాను. వెంటనే నాకు మా సుబ్బులు జ్ఞాపకానికి వస్తోంది. తీగ కదిపితే డొంకంతా కదిలినట్లు... దాని వెనక అనేక సంఘటనలు జ్ఞాపకానికి వస్తున్నాయి. ఎంత వద్దనుకున్నా, దాని జ్ఞాపకాలు నన్ను వదలవు. వెంటాడుతూనే ఉన్నాయి.

సుబ్బులు నాకు చెల్లెలు. అమ్మకి మేం ముగ్గురం మగబిడ్డలం తర్వాత అది కలిగింది. నా వెనకనే అది పుట్టింది గనక దాని చిన్నతనం నాకూ చిన్నతనమే అయినా- అది చిన్నతనంలో ఎట్లా ఉండేదో నాకు ఇప్పటికీ జ్ఞాపకమే!

పెద్ద పెద్ద కళ్ళూ, ఎఱ్రగా, ముద్దుగా, బొద్దుగా ఉండేది. అమ్మ తప్ప మిగతా వాళ్లమంతా దాన్ని 'దుబ్బులూ' అని పిలిచేవాళ్లం. పసిది, దానికేం తెలుసు- ఎట్లా పిలిచినా పలికేది. అమ్మ మాత్రం వింటే కోప్పడేది. "ఎందుకురా దాన్ని అట్లా పిలుస్తారు. చిన్నప్పుడు దానిలాగే మీరూ రుబ్బుడు గుండులా ఇంత లావు వున్నారు" అని.

తల్లి ఆరోగ్యంగా ఉండాలేకానీ, చనుబాలకు కంట్రోలు లేదు గదా! కడుపునిండా తాగుతారు. భయం, దిగులూ లేదు. పసిపిల్లలు ఎందుకుండరు లావుగా.

మందంగా ఉన్నవారు, కాస్త మంద బుద్ధులుగా ఉంటారని కొందరంటారు. కానీ, మా దుబ్బులు విషయంలో మట్టుకు అది నిజం కాదు. అది చాలా చురుకైంది. కరుకైంది కూడా. నేను మూడో క్లాసులో ఉన్నప్పుడు, అది ఒకటో క్లాసులో ఉంది. ఐదో క్లాసులో ఇద్దరం కలుసుకున్నాం.

ఇద్దరం ఐదో క్లాసులో ఉండగా ఒక సంఘటన జరిగింది. ఆ సంఘటన నిన్నో, మొన్నో జరిగినట్లుంది. టీచరు నన్ను ఏదో ప్రశ్న అడిగాడు. నేను చెప్పలేకపోయాను. సుబ్బుల్ని అడిగితే, అది ఠకీమని చెప్పింది. సుబ్బుల్ని నాకు ముక్కు చెంపలు వెయ్యమన్నాడు టీచరు. అది మొదట మొరాయించింది. కాని టీచరు కళ్లురుమి గదిమేసరికి తప్పించుకోలేకపోయింది. బెరుకుబెరుకుగానే వచ్చి ముక్కు చెంపలు వేసింది.అది చూసి క్లాసు క్లాసంతా గొల్లున నవ్వారు. అప్పుడు నా స్థితి ఎట్లా ఉంటుందో ఎవరైనా ఊహించవచ్చు. టీచర్ని కైమా కొడదామనిపించింది. మా దుబ్బులు ముండని నమిలి మింగేద్దామనిపించింది. బెల్ కొట్టగానే గబాగబా బయటకు వెళ్లి నిలబడ్డాను. మా సుబ్బుల్ని ఎట్లా చితకతన్నాలో, మనసులో ఒకటి రెండుసార్లు రిహార్సలు కూడా చేసుకున్నాను. అది దగ్గరకు వచ్చింది. నేను చెయ్యికూడా ఎత్తలేదు. గొల్లుమని ఏడుపు లంకించుకుంది. దాన్ని సముదాయించ డానికి తాతలు దిగి వచ్చారు. నాకు జరిగిన అవమానానికి, నాకంటే అదే ఎక్కువ బాధపడింది.

ఆ యేడు నేనూ, సుబ్బులు ఇద్దరం ఐదో క్లాసు పాసయ్యాము. నాన్న నన్ను హైస్కూల్లో చేర్పించాలనుకున్నాడు. సుబ్బులు తనూ చదువుతానని మంకుపట్టు పట్టింది. మా ఊళ్లో ఉన్న కన్వర్టెడ్ క్రిస్టియన్లు కొంతమంది తమ పిల్లల్ని మిషనరీ స్కూళ్లల్లో చదివించేవాళ్లు. ఆ పిల్లల్తో పాటు హైస్కూల్లో చదవాలని దాని పట్టుదల. నాన్న ఇష్టపడలేదు. దానికి ఎంత ఉక్రోషమొచ్చిందో ఏమో, ఒక రోజంతా అన్నం నీళ్లు ముట్టుకొని వుంటే ఒట్టు! అమ్మ ప్రాణం పాయసం ఉడికినట్టు ఉడికిపోయింది. "ఈ హఠయోగి ముండ హఠం సాధిస్తోంది. నీళ్లుకూడా ముట్టక చచ్చేట్టుంది. పోనీ వెళ్లి చదువుకోనివ్వండి." అంటూ అమ్మ గట్టి సిఫార్సే చేసింది. నాన్న ఒప్పుకోక తప్పలేదు.

దాని సంబరం చూడాలే తప్ప చెప్పడానికి వీల్లేదు. బట్టలూ, అవీ సిద్ధమయ్యాయి. దానికి బట్టలు ఖర్చు తప్ప చదువు ఖర్చు ఏమీ లేదు. నామమాత్రంగా డబ్బు తీసుకొని, అన్నం పెట్టి చదువు చెప్పే వాళ్లు మిషనరీలు.

హైస్కూల్లో చేరాక, ఎండకాలం సెలవుల్లో తప్ప దాన్ని చూడటం పడేదే కాదు. దూరాభారమనో ఏమో మధ్యలో సెలవులకి వచ్చేదికాదు. ఏకంగా ఎండాకాలం సెలవులకి వచ్చేది.

సెలవులకి నాకంటే రెండురోజులాలస్యంగా వచ్చింది. సుబ్బుల్ని చూస్తే నాకు ఆశ్చర్యమయింది. సుబ్బరంగా అది సన్నబడి పోయింది.

"అమ్మో సుబ్బులికి కండలు కరిగాయే" అంటూచప్పట్లు కొట్టేను.

"పోనిద్దూ, ఆడపిల్లలు సన్నగా ఉంటేనే నాజూగ్గా ఉంటారు" అన్నది అమ్మ. మాట అయితే అన్నది కానీ, సుబ్బుల్ని చూసి అమ్మ బాధపడ్డట్టే ఉంది. సెలవుల్లో దాన్ని మామూలు మనిషిని చెయ్యడానికి అమ్మ పడ్డ తాపత్రయం అంతా ఇంతా కాదు. రోజుకొక పిండివంట చేసి పెట్టింది. కానీ అది మామూలు 'దుబ్బులు' కాలేకపోయింది.

"ఏం తిండిపెడతారే సుబ్బులూ?" అన్నాను.

ఆ విషయం ఎత్తేసరికి దాని మొగం చిన్నబోయింది. "ఏదో ఒకటి నీకెందుకు?" అంటూ మూతి ముడుచుకుంది.

అమ్మ అడిగితే చెప్పింది. అది చెబుతూంటే వళ్లు కంపరమెత్తింది. మొక్కజొన్నల సంకటీ, గంజీ- చత్ నేనయితే చదువు మానుకొని ఉందును. దాంతోకూడా అదే మాట అన్నాను. "అమ్మా, బాగానే చెబుతావ్. నీకేం! ఏదో ఒకటి తిని చదువుకోవాలి" అంది. దానికి చదువు మీదున్న అభిలాష అలాంటిది. అదేం ఖర్మో దాని ఆశ పూర్తిగా నెరవేరలేదు.

స్కూలు ఫైనల్‌లో నేను ఫెయిల్ అయ్యాను. అది మంచి మార్కులతో ఒడ్డెక్కింది. నేను ఫెయిల్ కావడంతో నాన్న చాలా నిరాశ చెందాడు. ఎలాగైనా నన్ను ఓ ఇంజనీరును చేసి, నా మీద చిన్న 'జాక్‌పాట్' కొట్టాలని ఆశించినట్టుంది. నేను ఫెయిల్ కావడం మూలానా, ఆ ఆశ కాస్త అడుగంటింది. ఆయన ఎంత బాధపడ్డాడంటే- కాలేజీలో చేరతానని అడగడానికి సుబ్బులు సాహసించలేకపోయింది. చిన్నప్పటి మాదిరి కాదు. దానికీ ఇంగిత జ్ఞానం ఉంది. నాన్న తన్ను పై చదువులకు పంపడని తెలుసు. అందుకని అది గమ్మున ఉండిపోయింది. మనసులో ఏం మధన పడిందో- అది దానికే తెలుసు.

నేను మళ్లీ స్కూల్లో చేరకుండా ప్రైవేటుగానే పరీక్షకు అప్పియర్ కావాలనుకున్నాను. అంటే సుబ్బులికి, నాకూ కలిసి మెలిసి ఉండే అవకాశం కలిగిందన్న మాట. అయినా నా దారి వేరు. దాని దారి వేరు. నాకు క్లాసు పుస్తకాలతో కుస్తీ పట్టడంతో సరిపోయేది. దానికి నాలాగ పరీక్షల బెడద లేదు గనక లైబ్రరీనుంచి పుస్తకాలు తెప్పించుకొని కూర్చునేది. చలం, కుటుంబరావు, గోపీచంద్, మునిమాణిక్యం- అందర్నీ చదువుతోంది అది. అలా బేఫికర్‌గా చదువుతూ కూర్చోవడం చూస్తే, నాకు కాస్త మంటగానే ఉండేది. అది అంతటితో ఆపలేదు. పుండుమీద కారం చల్లినట్టు, ఉన్నట్టుండి ఒకరోజు కథ ఒకటి రాసుకొచ్చి, నన్ను చూడమంది. కాన్వెంట్ ప్రాడక్ట్ కథ రాయడమంటే నాకు ఆశ్చర్యం కలిగింది. "నువ్వే రాశావా?" అన్నాను.

అది నావైపు చురచురా చూసి "మీ నాన్న రాశాడనుకున్నావా?" అంది. అంతరం తెలీకుండా అది నన్ను అనరాని మాటే అంది. దానికి కండలు కరిగాక కోపం పెరిగింది. నోరు మంచిది గాకుండా పోయింది. తెలిసి దాని జోలికి పోవడం నాదే అవివేకం.

సుబ్బులు ఆ కథని ఏదో వారపత్రికకి పంపింది. అచ్చు కాలేదు. అచ్చు కాలేదు గనుక అది మంచి కథే అయ్యుంటుందని, చాలా ఏళ్ల తర్వాత నాకో అనుమానం కలిగింది.

ఆ యేడే నాన్న సుబ్బులుకు పెళ్లి ప్రయత్నం మొదలుపెట్టాడు. ప్రారంభించిన వేళా విశేషమో ఏమో, దానికి సంబంధం త్వరలోనే కుదిరింది. వరుడు అట్టే ఆస్తిపాస్తులున్నవాడు కాకపోయినా, సుబ్బులు లాగే స్కూలు ఫైనల్ దాకా చదువుకున్నాడు. అబ్బాయి సలక్షణంగానే ఉన్నాడు. ఇంటి పట్టున ఉండి వ్యవసాయం చేసుకుంటున్నాడు.

"సుబ్బులూ నీకీ సంబంధం నచ్చినట్టేనా?" అన్నాను.

"నాకు నచ్చినవాడూ, నన్ను మెచ్చినవాడూ నా మెడలో తాళి కట్టాలన్న గొంతెమ్మ కోర్కెలు నాకేం లేవులే" అన్నది నిర్లిప్తంగా.

సుబ్బులు మాటకేంగానీ అమ్మకి మట్టుకు ఈ సంబంధం అంతగా నచ్చినట్టు లేదు. తన అయిష్టతని సణగడం ద్వారా వ్యక్తంచేసింది. నాన్న దాన్ని ఖాతరు చెయ్యలేదు. ఖచ్చితంగా చెప్పాడు. "నీకేం, కూతురికి ఇంజనీరో, డాక్టరో కావాలంటావు. పదిహేను వేలో, ఇరవై వేలో దానికే ఖర్చుచేస్తే మగపిల్లల గతేం కావాలి?" అన్నాడు.

"ఇంజనీర్లూ, డాక్టర్లూ కావాలని నేను ఏడ్వటం లేదు. మరీ గతిలేనట్టు దరిద్రపు కొంపల్లోకి తొయ్యవద్దంటున్నాను. దానికి అక్కడ సరిగ్గా జరక్కపోతే అది మళ్లీ మన కొంపమీదే పడుతుంది. కన్న నేరానికి అప్పుడైనా దాని మంచిచెడ్డలు మనమేచూడాలి. ఎందుకొచ్చిన గొడవ ఇదంతా" అని అమ్మ వాదన.

నాన్న ఉలకనూ లేదు, పలకనూ లేదు. ఆయన తీర్పుకు అప్పీలు లేదు. ఆయన నిశ్చయించిన సంబంధంతోనే సుబ్బులు పెళ్లి జరిగిపోయింది.

సుబ్బులు నాకు దూరమైపోయింది. ఆ ఏడు నేను స్కూలు ఫైనల్ పాసై కాలేజీలో చేరాను. నేను ఇంటర్మీడియెట్ పాస్ అయ్యేసరికి సుబ్బులు ఇద్దరు బిడ్డల తల్లి అయింది. రెండు కాన్పులూ మా ఇంట్లోనే జరిగాయి.

మూడో కానుపుకు మట్టుకు అది మా ఇంటికి రాలేదు. దాని సొంత ఇంట్లోనే పురుడు పోసుకుంది. అమ్మ అక్కడే ఉండి మంచి చెడ్డలు చూసింది. అమ్మ, అక్కడనుంచి వచ్చాక "ఎట్లా ఉందమ్మా సుబ్బులు?" అన్నాను.

"పెళ్లయి అయిదేళ్లు కాలేదు. అప్పుడే మూడు కాన్పులు ఎట్లా ఉంటుంది? చిక్కి సగమైపోయింది బిడ్డ" అన్నది దిగులుగా.

సుబ్బుల్ని నేను చూడక చాలా రోజులైంది. రెండో కాన్పుకి వచ్చినప్పుడు చూశాను. సుబ్బులు ఊరు దాని పెళ్లప్పుడు చూశాను. తర్వాత వెళ్లలేదు. ఒకటి రెండుసార్లు అది నన్ను వాళ్ల ఊరికి రమ్మని బలవంతం చేసింది. నేను ఏదో చెప్పి తప్పించుకున్నాను. "అయినా షావుకార్లు బీద వాళ్ల ఇళ్లకు వస్తారా!" అంటూ నిష్ఠూరమాడింది.

ఎందుకో వెళ్లి సుబ్బుల్ని చూడాలనిపించింది. వీలైతే రెండు మూడురోజులుండి వద్దామని బయలుదేరాను. నేను వెళ్లేసరికి పదకొండు గంటలైంది. ఇల్లు చూస్తే తాళం వేసి ఉంది. పక్కింటి

వాళ్లని వాకబుచేస్తే తోట దగ్గరకు వెళ్లిందని చెప్పారు. తోట ఎక్కడుందో విచారించి, కాళ్లీడ్చుకుంటూ అక్కడకు వెళ్లాను. సుబ్బులు కూలీలతో కలుపు తీయిస్తోంది. పుట్టింటి వాళ్లనిచూస్తే పుట్టెడు సంతోషం కలుగుతుందనుకుంటాను ఆడవాళ్లకి. నన్ను చూసి మహదానందం పొందింది అది. కుశల ప్రశ్నలు వేసి "ఇంటికి పోదాం పద" అన్నది.

"పిల్లలేరి?" అన్నాను.

సుబ్బులు కందిసాలుకేసి చూపింది. దాని సంపద అంతా కందిచెట్ల నీడలో ఉంది. సుబ్బులు వెళ్లి చంటిబిడ్డను తీసుకుంది. పెద్దదానికి నాలుగో యేడనుకుంటాను. నడవగలదు. రెండో బిడ్డని నేను ఎత్తుకున్నాను.

"ఎన్నేళ్లు పాపకి?" అన్నాను.

"దానికా? నాలుగోనెల. బంగారుతల్లి. ఏడుపే ఎరగదు. ఎక్కడేసినా పుస్తకంలా పడుకుంటుంది" అంటూ దారిపొడుగునా దాని పరాక్రమం వర్ణించి మురిసిపోతున్నది.

ఏడవడానికి చాలినంత శక్తిలేదేమో అని నా అనుమానం. సుబ్బులు ఇంటికొచ్చాక గబగబా వంట మొదలెట్టి ఒంటిగంటకి పూర్తిచేసింది. పులగమూ, గోంగూర పచ్చడి, పచ్చి పులుసూ.

నేను భోంచేస్తుండగా "ఇంట్లో పాడిలేదు. అవస్థగా ఉంది" అన్నది. సుబ్బులు నాకు నెయ్యి వడ్డించలేదు. అందుకని సంజాయిషీ ఇచ్చుకున్నట్టుంది.

నాకు ముద్ద దిగడం కొంచెం కష్టమే అనిపించింది. పిల్లలు మాత్రం ఆవురావురమని తింటున్నారు.

"రోజూ పొలంనుంచి వచ్చివంటచెయ్యాలా?" అన్నాను.

"ముప్పూటలా వంటలూ, వార్పులూ చేసుకుంటూ కూర్చుంటే అయినట్టే సంసారం. ఉదయం చేసుకున్నదే మధ్యాహ్నం తింటాం- అక్కడికి తీరిక దొరకడం లేదు" అన్నది.

పిల్లలిద్దరూ ఆవురావురమని ఎందుకు తింటున్నారో నాకు బోధపడింది. వేడిగా ఉన్న భోజనం కూడా వాళ్ల ప్రాణాలకి 'స్పెషల్' కింద లెక్క.

నా భోజనం అయ్యాక మా బావ పొలంనుంచి వచ్చాడు. "ఎప్పుడొచ్చావ్? అంతా బాగున్నారా?" అంటూ పలకరించటం తప్ప నాతోబాటు కూర్చొని కాసేపు మాట్లాడటానికి, ఆయనకు తీరికే లేదు.

రాత్రి ఏడింటివరకు ఆయన పత్తాలేడు. రాత్రి భోంచేసి వెన్నెల్లో మంచాలువేసి పడుకున్నాక, ఆయన తన ప్రణాళికలు వివరించడానికి మొదలెట్టాడు. ప్రణాళికలంటే- ఆయనకున్న పది వేల రూపాయల బాకీని తీర్చడానికి వేసుకున్న ప్రణాళికలు. పంచవర్ష ప్రణాళికల్లా, ప్రణాళికలు మట్టుకు బాగానే ఉన్నాయి.

"సోషలిజం వస్తే అందరికీ సుఖశాంతులు ఉంటాయట. అవునా అన్నా?" అన్నది మా సుబ్బులు.

"ఇక చాల్లే నోరు మూసుకో" అన్నాడు మా బావ.

"సోషలిజం మాట ఎత్తితే మీ బావకు మంట."

"ఎందుకూ?" అన్నాను నేను.

"సోషలిజమంటే మంట పుట్టడానికీ, కంపరమెత్తడానికీ మిల్లులూ, కార్లూ ఉండనవసరం లేదు. ఒక గజ్జి కుక్కపిల్లా, ఒక గొడ్డు మేకా చాలు. మీ బావకి పదెకరాల పొలం ఉంది. దానిమీద పదివేల అప్పు ఉంటే మాత్రమేం!" అన్నది మా సుబ్బులు నవ్వుతూ.

"మాటి మాటికి అప్పులున్నాయని ఎత్తిపొడవనవసరం లేదు. ఐదేళ్లపాటు తాలిచూడు. అప్పులన్నీ తీర్చి మరో పదెకరాల పొలం కొనకపోతే అప్పుడను."

మా బావకి పెద్ద ఆశే ఉన్నది. తలకుమించిన అప్పులు తీర్చడమంటే- చిల్లులుపడ్డ కుండను నీటితో నింపడం లాంటిది. చెమటోడిస్తే అప్పులు తీరుతాయా ఎక్కడన్నా! ఈ విషయం మా బావ గ్రహించినట్టు లేదు. ఆశ ఉన్నచోట అజ్ఞానమూ ఉంటుంది మరి.

తెల్లవారినాక నాకు అక్కడ ఉండాలని లేదు. అవును ఉండి ఏం చెయ్యను? వాళ్ల పని పాటలకి ఆటంకం.

"వెళ్తానమ్మా" అన్నాను.

"వెళ్లిరా! బాగా పనులున్నప్పుడు వచ్చావు. ఏం పొద్దుపోతుంది ఇక్కడ? ఈసారి వస్తే ఎండాకాలం రా. మాకూ తీరుబాటు ఉంటుంది" అన్నది సుబ్బులు.

"అలాగే" అన్నాను.

నిజానికి మళ్లీ ఎండాకాలం అక్కడికి వెళ్లాననుకోలేదు. కానీ వెళ్లక తప్పలేదు. ఉన్నట్టుండి సుబ్బులికి సీరియస్‌గా ఉందంటూ మనిషి వచ్చాడు. ఇంట్లో అందరం బయలుదేరాం. మేం వెళ్లేసరికి ఇంటినిండా జనం పోగై ఉన్నారు. డాక్టర్ ఇంజక్షన్ ఇస్తున్నాడు. సుబ్బులికి స్పృహ లేదు. నాకు ఏదో అంతా కలగా ఉంది. డాక్టరు వెంట గుంపుని చీల్చుకొని బయటికి వచ్చాను. సుబ్బులు కండిషన్ ఎట్లా ఉందో డాక్టర్ని అడుగుదామనుకున్నాను. కానీ గొంతు పెగల్లేదు. డాక్టరు నా పరిస్థితి అర్థం చేసుకున్నట్లుంది. నా వైపు తిరిగి పెదవి విరిచాడు.

"ఏం జబ్బు?" అన్నాను నూతిలో గొంతుకతో.

"ఏం చెప్పమంటారు. కాంప్లికేటెడ్ కేసు. మాల్‌న్యూట్రిషన్ మనిషిని పీల్చి పిప్పిచేసింది. మనిషి సరైన తిండి తీర్థాలు లేకపోతే యెన్నాళ్లు బతుకుతుంది?"

నా కడుపు భగ్గుమంది. ఇంట్లో అంతా ఒక్కసారి గొల్లుమన్నారు. సుబ్బులికి శాశ్వతమైన తీరుబాటు లభించింది. ఇక దానికి ఏ బాధలూ లేవు. అయినా ఏడవకుండా ఉండలేకపోయాను.

సుబ్బులు జ్ఞాపకం వస్తే ఇప్పుడూ ఏడుపు వస్తుంది. అవును ఏడ్వటం తప్ప ఏమీ చేతగాని వాళ్లం మనం.

**- (జులై - అక్టోబర్ 1969, సంవేదన త్రైమాసిక, రష్యన్‌లోకి అనువాదం 1970)**